సాక్షి
విజయనగరం
సోమవారం । 26 । జూన్ । 2023



సాధనమున సమకూరు విజయం..!
మారుతున్న పోటీ పరీక్షల సిలబస్ సరళికి అనుగుణంగా చేసే సాధనతోనే విజయం సాధ్యమవుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. - 8లో



ఉన్న ఊరిలో ఉపాధి
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అతి తక్కువ సమయంలో డ్వామా అధికారులు చేరువవుతున్నారు. - 8లో



ఒలింపిక్ డే రన్
అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

మినీ జాబ్‌మేళా రేపు

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న మంగళవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పనలో భాగంగా ఇంటర్మీడియెట్(ఎంపీసీ, బైపీసీ), డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులకు జిల్లా కేంద్రంలో ఎంఆర్ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు మేళా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జాబ్ మేళాకు ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. నిరుద్యోగులు వారి వివరాలను ఏపీ ఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్లో నమోదు చేసుకొని రిఫరెన్స్ నంబరుతో పాటు బయోడేటాతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7989826953, 8099461303, టోల్ ఫ్రీ 99888 53335 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విద్యాశాఖాధికారులతో డీఈఓ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలతో డీఈఓ లింగేశ్వరరెడ్డి విద్యా సంబంధిత అంశాలపై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక, నాడు-నేడు, చైల్డ్ ఇన్ఫోపై చర్చించారు. విద్యా సంబంధ అంశాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా అన్ని విషయాలపై అప్‌డేట్ కావాలని అన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్యదర్శులు

బొబ్బిలి: సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల కోసం కార్యదర్శులకు సబ్ రిజిస్ట్రేషన్ హోదా కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి కార్యదర్శులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం క్షీరాభిషేకం చేశారు. తమకు గౌరవ హోదా కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు తమ్మిరెడ్డి వెంకటరమణ అన్నారు. గతంలో జీఓ 2 విడుదల చేసినప్పుడు ఎల్లో మీడియా అనవసరమైన రాద్ధాంతం చేసిందని, తమకు మాత్రం అంగీకారమేనని అన్నారు. ఈ సందర్భంగా వారు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. సంఘం జిల్లా కోశాధికారి బొద్దూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగమేశ్వరరావు, బొబ్బిలి పరిసర ప్రాంతాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కామన్ సివిల్ కోడ్‌పై చర్చ జరగాలి

- జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి

విజయనగరం అర్బన్: దేశంలో కామన్ సివిల్ కోడ్ విధానం మంచిదే అయినప్పటికీ ఈ కోడ్ పట్ల దేశ వ్యాప్తంగా సమగ్రమైన చర్చ జరిపిన తరువాతే అమలు చేయాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల బీజేపీ ప్రభుత్వానికి ఎంత మాత్రం గౌరవం లేదని ఆరోపించారు. రాజ్యాంగం అందులోని అంశాల గురించి ప్రజలకు తెలియపరచడం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టంలేదని పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల గౌరవం లేని ఈ ప్రభుత్వం రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లను తొలగిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న భావనతో కేంద్రం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని ధ్వజమెత్తారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు ఏరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభ్యులు జి.లక్ష్మణరావు, జి.అప్పలనాయుడు, జాతీయ విద్యావిభాగం కన్వీనర్ పీవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

అనూహ్య అవకాశం..

ప్రజాసేవకు అంకితం

- నాలుగేళ్లలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- ఎంపీ ల్యాడ్స్ నిధులు సద్వినియోగం
- గతంలో రూ.3 కోట్ల నిధులు వదిలేసిన అశోక్
- 'సాక్షి'తో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఎంపీ టికెట్ రావడం అనూహ్యం.... వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని ప్రజలు ఆమోదించారు. విజయపథంలో నిలిపారు. లోక్‌సభలో అడుగుపెట్టేందుకు అవకాశం కల్పించారు. అందుకే.. రాజుల వలే ఇంటికే పరిమితం కాకుండా.. ప్రజాసేవలో తరించాలని భావించాను. నిత్యం జనంతోనే మమేకమవుతూ.. వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాను. ప్రతీ పల్లెను సందర్శిస్తున్నాను. సమస్యల పరిష్కారానికి చొరవచూపుతున్నాను. తీర గ్రామాల్లో సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటు, అత్యవసర వేళ రోగులకు వైద్యం అందించే అంబులెన్సుల కొనుగోలు, పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు, బస్సుషెల్టర్ల నిర్మాణం, పొందూరు ఖాదీ వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెట్ సదుపాయం కల్పన, పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఇలా.. బోలెడు ప్రజోపయోగకర పనులు పూర్తి చేయగలిగా. ప్రతీ పల్లెకు మేలు చేసి ప్రజల గుండెల్లో చోటు సంపాదించా. అందుకే.. పనితీరులో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచాను. నాలుగేళ్ల పాలనలో ఎంపీగా ప్రజల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి, ప్రజలతో మమేకమైన తీరును ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

'విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గంలో తొలి నుంచీ బీసీల ఆధిపత్యం కనిపిస్తుంది. రెండుసార్లు మినహా ఇక్కడి నుంచి ఎక్కువసార్లు గెలిచినవారు బీసీ నాయకులే. నాకన్నా ముందు కొండపల్లి పైడితల్లినాయుడు, కెంబూరు రామ్మోహన్‌రావు, బొత్స సత్యనారాయణ, బొత్స ఝాన్సీలక్ష్మి తదితర బీసీ నాయకులు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం ఎంపీగా పార్లమెంటులో అడుగుపెట్టాను. పాత పార్లమెంటు భవనంలో,ఇటీవల ప్రారంభమైన నూతన పార్లమెంటు సౌధంలో కూర్చొనే అవకాశం నాకు దక్కింది.



పూసపాటిరేగలో సోలార్ వెలుగులు

ప్రతి గ్రామాన వెలుగులు...

ఎక్కడైనా ఎప్పుడైనా విద్యుత్తు సరఫరాలో ఆటంకం ఏర్పడినా ముఖ్యంగా జిల్లా తీర ప్రాంత గ్రామాల్లో సోలార్ లైట్లు వెలుగు చూపిస్తున్నాయి. రూ.4 కోట్ల నిధులతో ప్రతి గ్రామంలో కనీసం రెండు నుంచి నాలుగైదు సోలార్ లైట్లను ఏర్పాటు చేయించాను. గతంలో ఎప్పటినుంచో కాలనీల్లో, వీధుల్లో అందినంత ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగానున్న విద్యుత్తు తీగలను, అడ్డంకిగానున్న విద్యుత్తు స్తంభాలను మార్చిడికి నిధులు కేటాయించాం.

అందరివాడిగా గుర్తింపు

ఎంపీగా గెలిచింది మొదలు ఈ నాలుగేళ్లలో విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ చుట్టి వచ్చాను. అక్కడి పరిస్థితులపై అవగాహన ఉంది. నా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి ప్రతి గ్రామం అభివృద్ధిలో నా వంతు కృషి చేశాను. కరోనా రెండేళ్ల కాలంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రాలేదు. తర్వాత వచ్చిన నిధులను ప్రాధాన్యతాక్రమంలో సద్వినియోగం చేశాను. కాస్త నిధుల కొరత ఉన్న గ్రామ పంచాయతీలు, మండలాలకు ప్రాధాన్యమిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.



బెల్లాన చంద్రశేఖర్, ఎంపీ, విజయనగరం

సాక్షి ఇంటర్వ్యూ

మత్స్యకారులకు విముక్తి...

సముద్రంలో చేపల వేటకు వెళ్లి పాకిస్తాన్‌కు చిక్కిన 23 మంది మత్స్యకారులను చెర నుంచి విడిపించడానికి కృషి చేశాను. వారిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్తే రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, బంగ్లాదేశ్ జైలులో ఉన్నవారినీ విడిపించగలిగాం. ఇక జీవనోపాధి కోసం గుజరాత్ తీరానికి వలసపోయి కరోనా సమయంలో అక్కడ చిక్కుకుపోయిన మత్స్యకారులను సురక్షితంగా సొంత ప్రాంతాలకు తీసుకురాగలిగాం.



పాకిస్తాన్ చెర నుంచి విడిపించిన మత్స్యకారులు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సందర్భం (ఫైల్)

సేవా కార్యక్రమాలకు నిధులు

ఎంపీ ల్యాడ్స్ రూ.93 లక్షల మేర నిధులతో మూడు అంబులెన్స్‌లు కొనుగోలు చేసి 108 సర్వీసుకు అందించాను. కరోనా సమయంలో రోగులకు తక్షణమే ఆక్సిజన్ అందించడానికి వీలుగా రూ.39 లక్షలు గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు కేటాయించాను. కోవిడ్ సమయంలో ప్రజలకు అందించిన సేవలకుగాను మన రాష్ట్రంలోని ఎంపీలకు ఇచ్చిన ర్యాంకింగ్‌లో నేను మూడో స్థానంలో నిలిచాను. దిశ పోలీసుస్టేషన్‌కు రూ.25 లక్షలు ఇచ్చాను. పాఠశాలల్లో డిజిటల్ క్లాసుల ఏర్పాటుకు రూ.55 లక్షల వరకూ నిధులిచ్చాను. బస్‌షెల్టర్ల నిర్మాణానికి సాయమందించాను.

నాడు నిర్లక్ష్యం చేసిన నిధులకు మోక్షం

విజయనగరం ఎంపీగా 2014 నుంచి 2019 వరకూ ప్రాతినిధ్యం వహించిన అశోక్ గజపతిరాజు రూ.3 కోట్ల మేర 16వ లోక్‌సభ ఎంపీ ల్యాడ్స్ నిధులను సద్వినియోగం చేయలేదు. నాడు నిర్లక్ష్యం వహించిన నిధులనూ తీసుకొచ్చి వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేశాను.

గజపతినగరం కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు పరుపులు, వంటపాత్రల కొనుగోలుకు తోడ్పాటు అందించాను. తోటపల్లి షట్టరు పునరుద్ధరణకు, అలాగే బొబ్బిలిలో ఒక ఇరిగేషన్ వర్క్‌కు రూ.8 లక్షల చొప్పున కేటాయించాను.

దీర్ఘకాల సమస్యలకు చెక్...

చీపురుపల్లిలో దీర్ఘకాలం సమస్యగానున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని సాకారం చేశా. విజయనగరం-పాలకొండ రోడ్డులో బ్రిటిష్‌వారి కాలంలో నిర్మించిన వంతెనకు మరమ్మతులు చేసినప్పటికీ ఇటీవల ఆకస్మికంగా కూలిపోయింది. దాని స్థానంలో కొత్త ఆర్‌ఓబీ నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.13 కోట్లు మంజూరు చేయించాను. ప్రస్తుతం నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయనగరం, బాతువా, కెల్లలో రైల్వే అండర్ పాసేజ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశాను. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుకే గాక తాగునీటి సరఫరాకు సంబంధించిన 397 పనులకు సుమారు రూ.15 కోట్ల నిధులు నా కోటా నుంచి కేటాయించాను.



చీపురుపల్లిలో నిర్మాణంలోనున్న ఆర్‌ఓబీ

ఫ్లోరైడ్ సమస్యకు చెక్

వంగర మండలం పరిధి కొట్టిశ, లక్ష్మీపేట గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటి సమస్యకు చెక్ పడింది. మడ్డువలస ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఈ రెండు గ్రామాల నిర్వాసితుల కోసం 2000 సంవత్సరంలో పునరావాస గ్రామాలుగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ప్రజలు ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగేవారు. ఈ నేపథ్యంలో ఎంపీల్యాడ్ నిధులు రూ.40 లక్షలతో పైప్‌లైన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాం.

చేనేత కార్మికులకు చేయూత...



ఖద్దరు వస్త్రాల తయారీలో పేరు ప్రఖ్యాతులున్నా పొందూరులోని చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను స్థానికంగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. పొందూరు ఖద్దరును జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావడానికి నేను చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇప్పుడా చేనేత కార్మికులు తాము తయారుచేసిన వస్త్రాలను దేశీయంగా ఎక్కడైనా విక్రయించుకోవచ్చు. ఎగుమతులూ చేసుకొనే వెసులుబాటు లభించింది.

లోక్‌సభలో మన వాణి

ఉమ్మడి విజయనగరం జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రకు సంబంధించిన పలు సమస్యలు, అంశాలపై లోక్‌సభలో మన వాణి వినిపించాను. మన రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఫ్లోర్‌లీడర్లు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డిల నేతృత్వంలో కృషి చేశాను. పోలవరం నిధుల సాధనకు గొంతు వినిపించాం. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం పోరాటం చేశాం. కాశీకి వెళ్లే భక్తుల కోసం రైలు వేయాలని అడిగాను. అలా విశాఖ-వారణాసి ఎక్స్‌ప్రెస్ రైలు సాధించాం. దీనికి సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం స్టేషన్లలో హాల్ట్ ఇచ్చేలా కృషి చేశాను.

దివ్యాంగులకు బాసటగా...

దివ్యాంగులకు బాసటగా సుమారు రూ.4 కోట్లతో వీల్‌చైర్లు, బ్యాటరీ వాహనాలు, కృత్రిమ అవయవాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 1700 మంది వరకూ అర్హులను గుర్తించాం. ఇందు కోసం నా కోటాలో రూ.73 లక్షలు మంజూరు చేయించాను.

కోట్ల నిధులతో పనులు మంజూరు



ఎంపీ నిధులతో చీపురుపల్లి కస్పా వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

తాజాగా రూ.3 కోట్ల నిధులతో వివిధ పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపాను. వాటిలో కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.9.80 కోట్ల మేర నిధులు అందుబాటులోకి వచ్చాయి. వీటి సద్వినియోగానికి వీలుగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆయా ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నాను. గజపతినగరంలో ఆర్‌ఓబీ నిర్మాణానికి రూ.12 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు చేస్తున్నాం. పీఎంజీఎస్‌వై మూడో దఫా నిధులతో విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో పలుచోట్ల రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాను. అంతకుముందు 30 చోట్ల రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయించాను.

ప్రజలకు అన్నివేళలా అందుబాటులో..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించేందుకు, ప్రభుత్వ పథకాలను వివరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేస్తున్నాం. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయబావుటా ఎగుర వేస్తుందనడంలో సందేహం లేదు. మరోసారి పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశమిస్తే ప్రజా శ్రేయస్సుకు మరింతగా పాటుపడతాను.'



ఎంపీ నిధులతో విజయనగరంలో నిర్మించిన రైల్వే అండర్ పాసేజ్

సీఎం సభా స్థలి పరిశీలన



ముఖ్యమంత్రి పాల్గొననున్న సభా వేదికను పరిశీలిస్తున్న ఉప ముఖ్య మంత్రి రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు

- పరిశీలనలో ఉప ముఖ్యమంత్రి, జెడ్పీ చైర్మన్
- గిరిజనాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

కురుపాం:

రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన అమ్మఒడి పథకం నిధులు తల్లుల ఖాతాలో బటన్ నొక్కి వేసే కార్యక్రమానికి ఈ నెల 28న కురుపాంకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభా స్థలి ప్రాంతాన్ని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆదివారం పరిశీలించారు. సభా స్థలం, రూట్ మ్యాప్, హెలీప్యాడ్ తదితర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తొలిత చినమేరంగి పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, అక్కడ నుంచి సభాస్థలికి కాన్వాయి ద్వారా వెళ్లే రోడ్డు మ్యాప్ చూశారు. సభా స్థలానికి ప్రజలు వచ్చేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. వారి వెంట కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఉన్నారు. కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గిరిజన పక్షపాతి సీఎం జగన్

రాష్ట్రంలో గిరిజనాభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సీఎం సభా స్థలి ఏర్పాట్లు పరిశీలన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కురుపాం నియోజకవర్గ కేంద్రంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను రూ.150 కోట్లతో 105 ఎకరాల్లో నిర్మాణం చేపట్టడం, సాలూరు నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీకు త్వరలో శంకుస్థాపన చేయనుండడం, పాడేరులో వైద్య కళాశాల, పార్వతీపురంలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి మంజూరు తదితరమైనవి ఇందుకు నిదర్శనమన్నారు. మన్యం జిల్లా ఏర్పాటు తరువాత తొలిసారిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి కార్యక్రమానికి హాజరవుతున్నారని, మన్యం ప్రజలు ఘనంగా స్వాగతం పలికి, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, జోగారావు మాట్లాడుతూ జగనన్నకు ఘనస్వాగతం పలికేందుకు సన్నద్ధం కావాలన్నారు.

ఆర్‌బీకేల ద్వారా..

పురుగు మందుల పంపిణీ

అన్నదాత సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి రైతులకు అవసరమైన పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థతో అంగీకారం కుదుర్చుకుంది.

- కోరమాండల్ సంస్థ అంగీకారం
- ఈ ఖరీఫ్ నుంచే సరఫరా
- ఖరీఫ్‌లో లక్ష లీటర్ల వరకు పురుగు మందుల వినియోగం
- ఖరీఫ్‌కు ఎరువుల సిద్ధం
- 24వేల మెట్రిక్ టన్నులు రెడీ

విజయనగరం ఫోర్ట్:

రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇక నుంచి పురుగు మందులు కూడా పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాదే అందించాలని అనుకున్నా కొన్ని సాంకేతిక కారణాల వల్ల పురుగు మందులు అందించలేకపోయింది. ఈ ఏడాది కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ అన్ని రకాల పురుగు మందులు అందించడానికి ముందుకు వచ్చింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఆర్‌బీకేల ద్వారా వీటిని సరఫరా చేయడానికి సంస్థ అంగీకరించింది.

ఖరీఫ్‌లో లక్ష లీటర్ల వరకు...

ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు, గోగు, అపరాలు తదితర పంటలు రైతులు సాగు చేస్తారు. వరి పంటకు సంబంధించి ఎద పద్ధతిలో విత్తనాలు చల్లిన మూడు రోజుల్లో కలుపు నివారణకు పురుగు మందులు వినియోగిస్తారు. నాట్లు వేసిన ఐదు రోజుల్లోగా కలుపు నివారణకు పురుగు మందులు వినియోగిస్తారు. పంట పిలకల దశ నుంచి కోత దశ వరకు వరి పంటకు వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తాయి. వీటి నివారణకు పురుగు మందులు వినియోగిస్తారు. అపరాలు, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలకు కూడా పురుగు మందులు వేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో ఏడాదికి లక్ష లీటర్ల వరకు పురుగు మందులు వినియోగం జరుగుతుంది. వీటి కోసం రైతాంగం సుమారు రూ.5 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఈ క్రమంలో పురుగు మందుల కోసం రైతులు ఎక్కడికో పరుగులు తీయకుండా గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా అందించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.



పురుగు మందులు

ఎరువులు సిద్ధం

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవసరమైన ఎరువులను వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు 42 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా ప్రస్తుతం 24 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. యూరియా 15,477.46 మెట్రిక్ టన్నులు ఉండగా ప్రైవేటు డీలర్ల వద్ద 10,104.66 మెట్రిక్ టన్నులు, ఆర్‌బీకేల వద్ద 36,345 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. డీఏపీ 5,039.66 మెట్రిక్ టన్నులకుగాను ప్రైవేటు డీలర్ల వద్ద 2,952.81 మెట్రిక్ టన్నులు, రైతు భరోసా కేంద్రాలు వద్ద 1,786.85 మెట్రిక్ టన్నులు ఉంది. పొటాష్ 810.85 మెట్రిక్ టన్నులు ఉండగా అందులో ప్రైవేటు డీలర్లు వద్ద 218.1 మెట్రిక్ టన్నులు, ఆర్‌బీకేల వద్ద 592.75 మెట్రిక్ టన్నులు ఉంది. కాంప్లెక్సు ఎరువులు 2,449.32 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు డీలర్లు వద్ద 2427.07 మెట్రిక్ టన్నులు, రైతు భరోసా కేంద్రాల వద్ద 22.25 టన్నులు ఎరువులు ఉన్నాయి. సింగిల్ సూపర్ పాస్ఫేట్ 643.30 మెట్రిక్ టన్నులు ఉంది. ఇందులో ప్రైవేటు డీలర్లు వద్ద 643.30 మెట్రిక్ టన్నులు ఉంది.



డీఏపీ ఎరువుల బస్తాలు

పురుగు మందులు ఇస్తాం..

రైతు భరోసా కేంద్రాల ద్వారా పురుగు మందులు రైతులకు అందించనున్నాం. ఈ ఏడాది ఖరీఫ్‌లో అన్ని రకాల పురుగు మందులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాలు కూడా సిద్ధం చేసాం. ఇప్పటికే 24,665 క్వింటాళ్లు రైతులకు అందించాం. 24 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ప్రైవేటు డీలర్లు, ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

ఫేక్ ఐడీతో రైల్వే రిజర్వేషన్లు

● దాడులు చేసిన ఇంటెలిజెన్స్ అధికారులు

రాజాం/సంతకవిటి: రాజాం పట్టణంతో పాటు సంతకవిటి మండలంలో పలుచోట్ల ఫేక్ ఐడీలతో రైల్వే రిజర్వేషన్ చేస్తున్న దొంగలను భువనేశ్వర్ ఐఆర్‌టీసీ ఇంటెలిజెన్స్ అండ్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. సంతకవిటి మండలం మండాకురిటి రైతు భరోసా కేంద్రం వద్ద ఓ యువకుడు ఫేక్ ఐడీలతో రైల్వే రిజర్వేషన్లు చేస్తున్నాడు. ఈ విషయాన్ని రైల్వే ఇంటెలిజెన్స్ బృందం గుర్తించి శనివారం మెరుపుదాడిచేసింది. ఈ ఘటనలో రైతు భరోసా కేంద్రం వద్ద కంప్యూటర్ సిస్టమ్‌తో పనిచేస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని వస్తుసామగ్రిని బృందం సీఐ టీకే నాయక్ సీజ్‌చేశారు. అక్కడి నుంచి యువకుడు అందించిన సమాచారం మేరకు సంతకవిటి మండలంలోని కొండగూడెంతో పాటు రాజాం పట్టణంలో ఉంటున్న మరో యువకుడిని అదుపులోకి తీసుకుని కంప్యూటర్ సామగ్రిని సీజ్‌చేసి కేసులు నమోదు చేసినట్లు రైల్వే ఇంటెలిజెన్స్ పోలీసులు వెల్లడించారు. ప్రబల్ డేటా ఆధారంగా రాజాం, సంతకవిటి మండలంలో ఈ మోసాలు చేస్తున్నట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఎనిమిది ఫేక్ ఐడీలతో ఈ యువకులు ఇలా రిజర్వేషన్లు చేసి తప్పుడు మార్గంలో అక్రమార్జన చేస్తున్నారన్నారు. వారిపై కేసులు నమోదుచేసి క్రైమ్ ఇన్విస్టిగేషన్ టీమ్‌కు అప్పగిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా మండాకురిటి రైతు భరోసా కేంద్రం వద్ద పోలీసులకు పట్టుబడిన యువకుడి వివరాలపై సంతకవిటి వ్యవసాయశాఖ అధికారి నవీన్ వద్ద సాక్షి ప్రస్తావించగా, ఆ యువకుడు తమ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వ్యక్తికాదని ఖండించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బొబ్బిలి: మండలంలోని పారాదికి చెందిన సూర్రెడ్డి గౌరీశ్వరి(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. టీకొట్టు నడుపుతున్న భర్త రవితో కలిసి రామభద్రపురంలోని చర్చికి ఆదివారం ఆమె వెళ్లింది. అక్కడి నుంచి భర్తను విడిచిపెట్టి ముందుగా ఇంటికి వచ్చేసింది. ఆ తరువాత భర్త రవి ఇంటికి వచ్చేసరికి అపస్మారక స్థితిలో గౌరీశ్వరి ఉంది. దీంతో స్థానికులను పిలిచి 108 అంబులెన్స్‌కు సమాచారమందించాడు. వెంటనే వచ్చిన అంబులెన్స్ సిబ్బంది పడిపోయి ఉన్న గౌరీశ్వరిని పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం మృతురాలి కన్నవారి గ్రామమైన రామభద్రపురం మండలం మర్రివలసకు మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తరలించారు. అక్కడి ఆర్‌ఎంపీ మృతదేహాన్ని పరిశీలించి తలపై గాయాలున్నట్లు గుర్తించాడు. దీంతో వెంటనే మృతదేహాన్ని తిరిగి బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు తెలియజేస్తామని సీఐ ఎం.నాగేశ్వర రావు తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి గాయత్రి కాలనీకి చెందిన రెడ్డి దుర్గారావు ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడి రూ.1.16 లక్షలు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించి సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గారావుకు ఈనెల 21న మధ్యాహ్నం 812774206 నంబర్ నుంచి ఫోన్‌చేసి ఆర్‌బీఎల్ బ్యాంకు సిబ్బంది మాట్లాడినట్లు మాట్లాడారు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకునేందుకు అర్హుడివని చెప్పడంతో దుర్గారావు అంగీకరించాడు. దీంతో వారు వాట్సాప్ (9120028195) నంబర్‌కు పంపించిన లింకును ఓపెన్ చేసి క్రెడిట్ కార్డు నంబర్‌తో పాటు సీవీవీ పిన్ వివరాలు నమోదు చేయమనడంతో చేశాడు. దీంతో వెంటనే రెండు ఓటీపీలు వచ్చి, ఆటోమేటిక్‌గా ఎంటర్ అయి కార్డు నుంచి రెండు అమౌంట్‌లు డెబిట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. ఒక మెసేజ్‌లో రూ.98వేలు, మరో మెసేజ్‌లో రూ.18వేలు మొత్తం రూ. 1.16 లక్షలు కార్డు నుంచి డెబిట్ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే అది మోసపూరిత ఫోన్‌కాల్‌గా గుర్తించి ఆర్‌బీఎల్ బ్యాంకు సిబ్బందికి విషయం చెప్పి కార్డును బ్లాక్ చేయించాడు. అనంతరం సైబర్ క్రైమ్‌కు ఫోన్‌చేసి వివరాలు వెల్లడించడంతో వారు చెప్పిన విధంగా కంప్లైంట్ చేశాడు. జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో కేసు రిజిస్టర్ చేసిన అనంతరం రాజాం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు దుర్గారావు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,180-00
బంగారం(22సి. 10గ్రా.)	54,250-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ చైర్మన్ కిరణ్‌కుమార్



ఎగ్జామ్ రాస్తున్న అభ్యర్థులు

సాధనమున సమకూరు విజయం..!

● సృజనాత్మకత..అభ్యసనతో పోటీ పరీక్షల్లో రాణింపు

● గ్రూప్-2 పోటీ పరీక్షల అవగాహన సదస్సులో వక్తలు

విజయనగరం అర్బన్: మారుతున్న పోటీ పరీక్షల సిలబస్ సరళికి అనుగుణంగా చేసే సాధనతోనే విజయం సాధ్యమవుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే అభ్యసనకు సృజనాత్మకత తోడు కావాలని ఆ దిశగా శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. సాక్షి మీడియా గ్రూప్, హైదరాబాద్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హోటల్ ఆనంద్ గ్రాండ్ ఫోర్ట్‌లో గ్రూప్-2 పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం త్వరలో ఏపీపీఎస్‌సీ ద్వారా పెద్ద సంఖ్యలో గ్రూప్-2 కేడర్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో పోటీ పరీక్షలకు తగ్గట్లు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు నిపుణులైన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం (హిస్టరీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ), ఎం.డి పాషా (ఎకనామీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), టి.రవి (కరెంట్ ఎఫైర్స్) హాజరై అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. తొలుత ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ విధానంలో వేల మంది అభ్యర్థులు తమ వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. సాక్షి శ్రీకాకుళం యూనిట్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ బెహరా స్వామి మాట్లాడుతూ పోటీ పరీక్షల అభ్యర్థులకు సాక్షి భవిత, సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ద్వారా ప్రామాణికమైన మెటీరియల్ అందిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు ఇలాంటి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు మాట్లాడుతూ లక్ష్యంతో ముందుకెళ్తూ ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. విజయనగరం సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జ్ పీసీహెచ్.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ పరీక్షల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులను సైతం ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉజ్వల భవితకు సాక్షి భవిత ద్వారా మార్గం చూపుతున్నామన్నారు. అనంతరం అభ్యర్థులకు నమూనా టాలెంట్ టెస్ట్ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు బహుమతి, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేశారు. మరో 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో సాక్షి అడ్వర్‌టైజ్ మెంట్ మేనేజర్ రాపాక నగేష్, ఈవెంట్ మేనేజర్ మారుతి, సాక్షి అడ్వర్‌టైజ్ మెంట్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న తాడి ముకుంద

అత్యుత్తమంగా గ్రూప్-2 శిక్షణ

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణను ఆర్‌సీ సంస్థ ద్వారా అందిస్తున్నాం. రాష్ట్రంలోని అత్యుత్తమ ఫ్యాకల్టీలందరూ మా సంస్థలో బోధిస్తున్నారు. వారి సహకారంతో ఈ నెల 19 నుంచి ఏపీపీఎస్‌సీ గ్రూప్-2 బ్యాచ్‌కు ప్రవేశాలు ప్రారంభించాం. హైదరాబాద్ రాలేని ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, ఇతర విద్యార్థుల కోసం ఎగ్జామ్స్ మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో శిక్షణ అందిస్తాం. పూర్తి వివరాల కోసం 8985093399, 8985094499 నంబర్లకు సంప్రదించాలి.

- ఎం.కిరణ్‌కుమార్, చైర్మన్ ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, హైదరాబాద్

ఎక్కువ సార్లు సాధన చేయడమే విజయ రహస్యం

పోటీ పరీక్షల లక్ష్య సాధనకు తీసుకునే క్రమశిక్షణ చర్యల్లో సిలబస్‌ను ఎక్కువ సార్లు సాధన చేయడం కీలకమైనది. అదేవిధంగా గైడెన్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇతరుల అనుభవాలను తీసుకోవడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చు. విజేతల బయోగ్రఫీలతోపాటు పరాజితుల ఇంటర్వ్యూలను ఆదర్శంగా తీసుకోవాలి. ఏమి చేయాలో ఏమి చేయకూడదో తెలుసుకుంటే విజయం తథ్యం. సంక్షిప్తత నుంచి సరళత్వం దిశగా సాధన ఉండాలి. నాణ్యమైన కంటెంట్, సిలబస్‌ను లోతుగా చదవాలి. ఎక్కువసార్లు సాధన చేయడమే విజయ రహస్యం.

-పి.హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

కాన్సెప్ట్ ఓరియంట్ పరిజ్ఞానం పెంచుకోవాలి

కరెంట్ ఎఫైర్స్‌లో శతశాతం మార్కులు తెచ్చుకోవడానికి కాన్సెప్ట్ ఓరియంట్ పరిజ్ఞానం తప్పనిసరి. ఆ దిశగా ప్రయత్నించేందుకు ఏ రోజుకారోజు నోట్స్ తయారు చేసుకోవాలి. దినపత్రికలను తప్పనిసరిగా చదివి అందులో ప్రధాన అంశాలను నోట్స్‌గా చేసుకోవాలి. కరెంట్ ఎఫైర్స్ ప్రశ్నల కోసం ప్రత్యేకించి పుస్తకాలు చదవడం కంటే ఈ ప్రక్రియ మంచి ఫలితాలను ఇస్తుంది. మిగిలిన అన్ని సబ్జెక్టుల నుంచి కరెంట్ ఎఫైర్ ప్రశ్నలు వస్తాయి. వాటిలో కూడా ఇదే విధంగా ఓరియంటల్‌గా ప్రిపరేషన్ చేయాలి.

టి.రవి, కరెంట్ ఎఫైర్స్

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ సదస్సు వరంగా నిలిచింది. గ్రూప్-2 పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ చక్కగా చేసిన మార్గ నిర్దేశం. ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా హాజరయ్యే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చో అర్థమయ్యేలా చక్కగా వివరించారు.

-తాడ్డి ముకుంద, చంద్రంపేట, నెల్లిమర్ల

ఉన్న ఊరిలో ఉపాధి

● లక్ష్యానికి చేరువగా నిర్దేశించిన పనిదినాలు

● పనిదినాల కల్పించాల్సింది 1.97కోట్లు

● ఇప్పటి వరకు పూర్తయినవి 1.23 కోట్లు

● ఉత్సాహంగా పని చేస్తున్న వేతనదారులు



గంట్యాడ మండలం పెదవేమలిలో పనులు చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అతి తక్కువ సమయంలో డ్వామా అధికారులు చేరువవుతున్నారు. లక్ష్య సాధనకు ఇంకా 9 నెలల సమయం ఉన్నప్పటికీ ఇప్పటికే బాగా చేరువయ్యారు. పనిదినాల కల్పనలో రాష్ట్ర స్థాయిలో విజయనగరం ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు శతశాతం సాధించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో1.97కోట్ల పనిదినాలు వేతనదారులకు కల్పించాల్సి ఉండగా ఇంతవరకు 1.23 కోట్ల పనిదినాలు కల్పించారు. ఉన్న ఊరిలోనే ఉపాధి దొరుకుతుండడంతో వేతనదారులు కూడా ఉత్సాహంగా పనుల్లో పాల్గొంటున్నారు.

రోజుకు సగటున 1.52 లక్షల మందికి పని

ఉపాధిహామీ పథకం ద్వారా రోజుకు లక్ష మందికి పైగా జిల్లాలోని వేతనదారులకు పని కల్పిస్తున్నారు. వేతనదారులకు పని కల్పించడంలో రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గడిచిన మూడు నెలల్లో రోజుకు సగటున 1.52 లక్షల మంది వేతనదారులకు పని కల్పించారు. ఇంతవరకు రూ.298.25 కోట్లు వేతన రూపంలో చెల్లించారు.

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వాటిలో యాక్టివ్ జాబ్ కార్డులు 3.17 లక్షలు. వేతనదారులు 6.98 లక్షల మంది ఉన్నారు. వారిలో 6.06 లక్షల మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు.

సాఫీగా కుటుంబపోషణ

ఉన్న ఊరిలో పనిదొరకడంతో పాటు పనికి సంబంధించిన వేతనాలు కూడా సకాలంలో వేతనదారులకు ప్రభుత్వం చెల్లిస్తోంది. వారానికి రూ.1400 నుంచి రూ.1600 వరకు వేతనదారుడికి పేమెంట్ అందుతోంది. దీంతో వేతనదారుడి కుటుంబ పోషణ సాఫీగా సాగిపోతోంది.

మండలాల్లో గరివిడి ప్రథమ స్థానం

ఉపాధిహామీ వేతనదారులకు పని కల్పించడంలో జిల్లాలో గరివిడి మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. గడిచిన మూడు నెలల్లో 6.97 లక్షల మంది వేతనదారులకు పని కల్పించారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన గుర్లలో 6.49 లక్షల మంది వేతనదారులకు పని కల్పించారు.

ఎస్‌ఎంఎంఎస్ యాప్‌లో పనివివరాల నమోదు

ఉపాధిహామీ వేతనదారులకు సంబంధించి మస్టర్‌లను నూతన విధానంలో నమోదు చేస్తున్నారు. గతంలో పనికి వచ్చే వేతనదారుల వివరాలు పేపర్‌పై నమోదు చేసేవారు. ఇప్పుడు దానికి స్వస్తి పలికారు. నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) యాప్‌ద్వారా వేతనదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. వేతనదారులకు పనిచేసే చోట ఫొటో తీసి ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తారు. దీని వల్ల పనికి రాకుండా వచ్చినట్లు మస్టర్ వేసుకునే అవకాశం ఉండదు. బినామీ మస్టర్లకు పూర్తిగా చెక్ పడుతుంది.

3 నెలల్లోనే 1.23 కోట్ల పనిదినాలు



లక్ష్య సాధనకు ఇంకా 9 నెలలు సమయం ఉన్నప్పటికీ ఈఏడాది 3 నెలల్లోనే 1.23 కోట్ల పనిదినాలు కల్పించారు. వేతనదారులు అధిక సంఖ్యలో పనులకు వస్తున్నారు. వేతనదారులకు పేమెంట్ కూడా బాగా వస్తోంది.

జి. ఉమాపరమేశ్వరి, పీడీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు, క్రీడాభిమానులు

● ప్రారంభించిన ఎమ్మెల్సీ రఘువర్మ

● అధిక సంఖ్యలో పాల్గొన్న క్రీడాకారులు, క్రీడాభిమానులు

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా జరిగింది. నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి కోట వరకు నిర్వహించిన రన్‌లో అధిక సంఖ్యలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న వారందరికీ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన టీ షర్టులు, టోపీలు అందజేశారు. అంతకుముందు రాజీవ్ స్టేడియంలో ఒలింపిక్ డే రన్‌ను ఎమ్మెల్సీ పాకల పాటి రఘువర్మ క్రీడా జ్యోతి వెలిగించి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రారంభమైన ర్యాలీ కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, గంటస్తంభం జంక్షన్, మెయిన్‌రోడ్, మూడులాంతర్ల జంక్షన్, డీసీసీబీ రోడ్ మీదుగా కోట జంక్షన్ వరకు సాగింది. అంతకుముందు రాజీవ్ స్టేడియంలో సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు.

క్రీడాస్ఫూర్తి కలిగించేందుకే రన్

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ క్రీడా కారులలో సమానత్వం భావం కలిగించి, క్రీడా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లా ముందువరుసలో ఉండేలా క్రీడలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్. వేణుగోపాలరావులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హితవు పలికారు. క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాటు స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు. గ్రామస్థాయి నుంచే వివిధ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.సుభాష్ చంద్రబోస్, డోలా మన్మథకుమార్, కోలగట్ల ప్రతాప్, బొమ్మన రామారావు, ఏఎస్‌ఎం కమలనాభరావు, కేపీ బాలకృష్ణ, టీవీ భగవాన్ దాస్, కేవీఎస్ రాజు, కె.సన్యాసినాయుడు, కె.గోపాల్, వి.మల్లేశ్వరరావు, ఎలుగుబంటి రమణ, లీలా కృష్ణ, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ స్టేడియంలో ఒలింపిక్ డే రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

తాడ్డి కుటుంబానికి హైకోర్టు జడ్జి పరామర్శ

● సన్యాశినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు

గజపతినగరం: సీనియర్ రాజకీయ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తాడ్డి సన్యాసినాయుడు ఇటీవల స్వర్గస్తులు కావడంతో ఆయన కుటుంబసభ్యులను హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి దంపతులు ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి, ఆయన సతీమణి గీత, విజయనగరం జిల్లా న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి, విశాఖ జిల్లా జడ్జి గోపి, బొబ్బిలి ఆర్డీఓ శేష శైలజ, స్థానిక తహసీల్దార్ ఎం.అరుణకుమారి తదితరులు అంతా వచ్చారు.ముందుగా సన్యాసినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి హైకోర్టు చీఫ్ జస్టిస్ నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు.



తాడ్డి సన్యాసినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేషసాయి దంపతులు

సెంచూరియన్‌లో ముగిసిన లాన్ టెన్నిస్ పోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో గడిచిన రెండు రోజులుగా జరుగుతున్న లాన్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. సింగిల్స్‌లో విన్నర్‌గా మహేష్, రన్నర్‌గా పీఎస్ రాజు నిలిచారు. డబుల్స్‌లో విజేతలుగా రామారావు, సుదర్శన రాజు, రన్నర్స్‌గా సన్యాసిరాజు, ప్రశాంత్ నిలిచారు. లాన్‌టెన్నిస్ విన్నర్‌కు రూ.5వేలు, రన్నర్‌కు రూ.2,500 చొప్పున నిర్వాహకులు బహుమతులు అందజేశారు. వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలు కొనసాగుతున్నాయని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు.

అశాస్త్రీయ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విజయనగరం అర్బన్: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అశాస్త్రీయ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు అభిప్రాయ పడ్డారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖకు ఇచ్చే కేటాయింపుల విషయంలో కోత విధించడమే కాకుండా అశాస్త్రీయ అంశాలను ఉన్నత విద్యలో కోర్సులుగా ప్రవేశపెట్టడం సిలబస్‌లో మార్పులు చేయడం వంటి చర్యలు చేపట్టి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ (హెచ్)లో చెప్పిన శాస్త్రీయ దృక్పథం అన్న స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ కేంద్రప్రభుత్వం అనేక ఏకపక్ష నిర్ణయాలను తీసుకోవడం అభ్యంతరకరమని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న ప్రగతి శీల సంఘాల ప్రతినిధులు డాక్టర్ వీఎస్‌ప్రసాద్ (పూర్వ ఐఎంఏ అధ్యక్షులు), జి.మురళీధర్, డాక్టర్ ఎంవీఎస్ వెంకట్రావు, పి.రమణ ప్రభాత్ (జనవిజ్ఞాన వేదిక), జీబీ నాయుడు (పీఆర్‌ఇంజినీర్స్), కె.మురళీబాబు (ఆర్‌అండ్‌బీ ఇంజినీర్స్), సీహెచ్.వెంకటేష్ (ఎస్ఎఫ్ఐ), జె.రమేష్ పట్నాయక్ (యూటీఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తిగా గురజాడ ఇల్లు తీర్చిదిద్దాలి




గురజాడ స్వగృహంలో ఆయన మునిమనుమడు ప్రసాద్‌తో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ

● లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్

విజయనగరం టౌన్: గురజాడకు తగినంతగా గుర్తింపు ఇవ్వడం లేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం గురజాడ స్వగృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాకవి గురజాడ ఇంటిని లండన్‌లో షేక్‌స్పియర్ ఇంటి మాదిరిగానే తీర్చిదిద్దాలని, భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలని అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వం చేసినంత సాయం చేస్తుంది. మనం కొంత మంది ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సామాజిక బాధ్యతగా అభివృద్ధికి పూనుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం గురజాడ స్వగృహమంతా కలియదిరిగారు. గురజాడ వాడిన బావి, కళ్లద్దాలు, పుస్తకాలు చూసి ఆనందించారు. రిజిస్టర్ బుక్‌లో సంతకం పెట్టి, ఎవరెవరు గురజాడ స్వగృహాన్ని సందర్శించారో వారి వివరాలను గురజాడ మునిమనుమలు వెంకటేశ్వరప్రసాద్, ఇందిరలు జయప్రకాశ్ నారాయణ్‌కు వివరించారు. అంతకుముందు ఓట్ ఇండియా సేవ్ డెమోక్రసీ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు భీశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో విక్రంపురం వాసి మృతి



జగదీష్ (ఫైల్)

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామనికి చెందిన కాలిశెట్టి జగదీష్(36) హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని ఎన్‌సీఎల్ కంపెనీలో పనిచేస్తున్న జగదీష్ విధులకు హాజరయ్యేందుకు ఉదయం 6.30 గంటల సమయంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.